# నూరేళ్ళ నిశ్శబ్దం

ఇల్లంతా నిశ్శబ్దంతో నిండిపోయింది. ఇంట్లో అందరూ బలవంతాన నడుస్తున్న ట్టున్నారు గానీ వాళ్ళలో చలనం అన్నది నశించినట్లుంది. నాలుగు రోజుల క్రితం వరకూ అరుపులూ, కేకలూ, నవ్వులూ, కేరింతలూ, మాటలూ వీటితో బతుకుతున్నట్టు కన్పించే ఆ ఇల్లు ఇవాళ చనిపోలేదని నిరూపించుకోటానికి ప్రయత్నిస్తున్నట్టుంది.

మధ్యాహం ఒంటిగంటయింది.

మిన్ను విరిగి మీదపడ్డా వంటింట్లో జరగాల్సిన పనులు మాత్రం ఆగవు. కోపాన్ని కంట్రోలు చేసుకోవచ్చు. దుఃఖాన్ని కంట్రోలు చేసుకోవచ్చు. ఆకల్ని కంట్రోలు చేసుకోలేం. దుఃఖాన్నీ, కోపాన్నీ, బాధనూ మరింత ఎక్కువగా ప్రదర్శించాలంటే వేళకింత తిండి కడుపులో పడాల్సిందే. అందువల్ల అంత నిశ్శబ్దంలోనూ వంటిల్లు తను చేయాల్సిన చప్పుళ్ళు చేస్తూనే వుంది.

రామలక్ష్మి వండినవన్నీ భోజనాల బల్ల మీద పెట్టి తన పనయిపోయినట్టు కూచుంది. చలపతిరావు యేదో నెపం మీద ఆ వైపు వచ్చి నిండుగా వున్న భోజనాల బల్లను చూసి నిట్టూర్చి

"అమ్మ అన్నం తిందా?" అనడిగాడు.

"ఊఁ" మూలిగింది రామలక్ష్మి.

ఇంతలో చంద్రం, మోహన్, లత, రేఖ వచ్చారు. అందరికీ వడ్డించింది రామలక్ష్మి.

"అమ్మాయిలేరి?" అనడిగాడు చలపతిరావు.

"మేడమీద గదిలో వాళ్ళ చెల్లెలికి బుద్ధి చెబుతున్నట్లున్నారు."

రామలక్ష్మి గొణిగింది.

"దానికి - బుద్ధి" చలపతిరావు పెరుగు వేసుకోకుండానే భోజనం ముగించి చెయ్యి కడిగేసుకున్నాడు.

ఆ తర్వాత కొడుకులూ, కోడళ్ళూ కూడా గిన్నెలు సర్ది ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళారు.

రామలక్ష్మి కూతుళ్ళు కిందికి దిగివస్తే తనూ ఇంత తిని కాసేపు నడుం వాలుద్దామని చూస్తోంది.

నాలుగంటే నాలుగు రోజుల క్రితం ఇల్లంతా చెప్పనలవిగాని సందడి.

చలపతిరావు రామలక్ష్మిల చిన్న కూతురు మాధవి పెళ్ళికి అంతా నిశ్చయమైంది.

కొడుకులిద్దరూ - బరోడా నుంచి చంద్రం, కలకత్తా నుంచి మోహన్ - నెలరోజులు శలవుపెట్టి భార్యాపిల్లలతో సహా వచ్చేశారు.

వరంగల్ నుంచీ, బెంగుళూరు నుంచీ మాధవీ అక్కలు సుమిత్ర, కళ్యాణి భర్తల్నీ పిల్లల్నీ తీసుకుని వచ్చారు.

అందరికంటే ఆఖర్న వచ్చింది పెళ్ళికూతురు మాధవే.

మాధవి ఎమ్.ఎ. ఎకనామిక్స్ పరీక్షలు రాసి గుంటూరు నుంచి వచ్చేసరికి ఆ అమ్మాయికి ఒక సంబంధం ఖాయం చేసి వుంచాడు చలపతిరావు. సంబంధమంటే మామూలు సంబంధం కాదు. ఆ అబ్బాయి కంప్యూటర్ ఇంజనీర్‌గా అమెరికాలో పని చేస్తున్నాడు. మంచి కుటుంబం. కట్నం కాస్త ఎక్కువనిపించినా చలపతిరావు వెనకాడలేదు.

రామలక్ష్మి కూడా "మాధవి పెళ్ళి తప్ప మనకింకో బాధ్యత లేదు. ఎలాగో ఈ ఒక్కటీ సక్రమంగా జరిపిస్తే మనకూ తృప్తిగా వుంటుంది. దానికివ్వాల్సింది ఇచ్చేస్తే మనం వున్నదాన్లో సర్దుకుందాం" అంటూ ప్రోత్సహించింది. చలపతిరావు పరిస్థితి కూడా బాగానే వుంది. వ్యాపారంలో ఒడిదుడుకులేమీ లేవు. పదిలక్షలు మాధవికి కట్నం ఇస్తే తమ ఇద్దరికీ తిండికి లేకుండా పోదు. కొడుకులకు వచ్చిన కట్నంలో సగం పైన తనే తీసుకున్నాడు. తీసుకోక తప్పలేదు. సుమిత్రకూ, కళ్యాణికీ చెరి అయిదు లక్షల కట్నమూ పెళ్ళి ఖర్చులూ భరించడం మామూలు కాదు. కొడుకులూ సంతోషంగానే ఇచ్చారు. కోడళ్ళూ యేనాడూ ఆ విషయం ప్రస్తావించలేదు. ఐదుగురు పిల్లల్ని కన్నందుకు అందర్నీ ప్రయోజకుల్ని చేశామని తృప్తి కలిగింది చలపతిరావుకు, రామలక్ష్మికి.

చలపతిరావు స్వయంకృషితో పైకి వచ్చినవాడు. అలాంటి మనుషులకుండే పట్టుదల, కాస్త అహం, ధీమా అన్నీ వున్నాయి.

ఇప్పటి వరకూ వాటికెలాంటి ఎదురుదెబ్బా తగల్లేదు.

భార్యా, కొడుకులూ, కూతుళ్ళూ అందరూ ఆయన మాటే విన్నారు.

తల్లి వెంకాయమ్మ ఒక్కత్తే ఆయన్ని కాస్త చిరాకుపెడుతుండేది.

చిరాకు పెట్టడమంటే కొడుకుని ఒక మాట అనటమో, సణగటమో, నాకిది లోటు చేశావని పోట్లాడడమో కాదు. ఆమె అసలు మాట్లాడదు.

అరవై అయిదు ఏళ్ళ వయసులో పల్లె నుంచి హైదరాబాదు వచ్చిన వెంకాయమ్మ నిశ్శబ్దాన్ని వెంటబెట్టుకుని వచ్చింది. వచ్చి పాతికేళ్ళపైనే అయింది. తొంభై ఏళ్ళ ముదివగ్గు. ఐనా తన పనులు తను చేసుకునే ఓపికుంది. ఆ ఓపికను కాపాడుకోవడం తప్ప ఆమె మరో పనిలో జోక్యం కలిగించుకోదు. వేళకు రామలక్ష్మి పెట్టింది తిని, ఇంటి ముందున్న మొక్కల దగ్గరకు చేరుతుంది. చెట్లకు పాదులు చెయ్యటం, గడ్డీ, పిచ్చి మొక్కలూ

పీకెయ్యటం, నెమ్మదిగా నీళ్ళు పొయ్యటం, పూలూ, కాయలూ, ఆకుకూరలూ మెల్లిగా కోసి తీసుకురావటం ఇట్లా యేదో ఒక పని పొద్దునా సాయంత్రం నడుం ఒంచి చేస్తుంది. తోటని ఇంటికంటే పద్ధతిగా శుభ్రంగా వుంచుతుంది. ఆ పని తప్ప మరేది పట్టించుకోదు.

మనవలతో, మనవరాళ్ళతో కూడా పెద్దగా మాట్లాడదు.

నిశ్శబ్దంగా తోటలో, ఇంట్లో తిరుగుతుండే వెంకాయమ్మకు అందరూ అలవాటు పడిపోయారు.

రామలక్ష్మికి మొదట్లో కాస్త చిరాగ్గా వుండేది.

"ఏంటి మనిషి? ఒక మంచీ లేదు, చెడ్డా లేదు. నవ్వుతూ మాట్లాడుతూ తిరిగితే ఆమె సొమ్మేంపోయింది? దివాలా తీసిన కోటీశ్వరుడిలా అట్లా వుంటుందేమిటి" అని గొణుక్కునేది.

క్రమంగా ఆమెకీ అలవాటయింది. "ఇదే సుఖమంటే. మాటామాటా అనుకోనక్కర్లేదు. ఈ ఇంట్లో నా ఇష్టానికి ఎదురులేదు" అనుకుని ఊరుకుంది. చలపతిరావుకి కూడా వేరే చిరాకేమీ లేదు. తన ప్రయోజకత్వాన్ని తల్లి గుర్తించి నాలుగు మంచి మాటలాడితే బాగుండునని తప్ప !

అతని తండ్రి చేసిన నిర్వాకానికి అతను మట్టిగొట్టుకుపోవచ్చు. కానీ పదిహేనేళ్ళ వయసులో హైదరాబాదు వచ్చిపడి ఆటుపోట్లన్నీ తిని లక్షలు సంపాదించాడు. తల్లికీ, భార్యకూ, పిల్లలకూ ఏ లోటూ లేకుండా చూసుకొస్తున్నాడు.

అట్లాంటి కొడుకుని చూసి ఏ తల్లికళ్ళయినా ఆనందంతో వెలిగిపోవచ్చు. మా నాయన ఎంత గొప్పవాడయ్యాడని మురిసిపోవచ్చు.

కానీ వెంకాయమ్మ కళ్ళల్లో దిగులూ, నిర్లిప్తతా తప్ప ఎన్నడూ మరే భావమూ కన్పించదు.

చేసేదేముంది. అందరూ దానికే అలవాటు పడిపోయారు.

ఐతే ఇప్పుడొచ్చింది చిరాకు కాదు. పెద్ద గండం. పిడుగుపాటు. అది వెంకాయమ్మ వల్ల కాదు. ఆమె కంత శక్తి లేదు.

ఆ పిడుగు పడేసింది మాధవి.

మాధవి చలపతిరావు సంతానంలో చివరది. అందరికీ తగని గారాబం. పిల్లలందరిలో తెలివైందని తల్లితండ్రులకు గర్వం. మాధవిని డాక్టరు చదివించాలని చలపతిరావుకి కోరికగా వుండేది. మాధవి ఆ కోరిక తీరుస్తుందనే అనుకున్నారంతా. కానీ ఆ పిల్ల సరిగ్గా ఇంటరు పరీక్షల ముందు జబ్బు పడింది. రావాల్సిన మార్కులు రాలేదు. మరోసారి పరీక్ష రాయమంటే రాయనంది. బి.ఏ.లో చేరింది. అదయ్యాక నాగార్జునా

యూనివర్శిటీలో ఎకనామిక్స్ ఎం.ఏ.లో చేరింది. ఆమె ఎం.ఏ.లో చేరిన దగ్గరనుంచీ చలపతిరావు సంబంధాలు వెతుకుతూనే వున్నాడు. అవి మాధవి దాకా రాకుండానే వెనక్కు పోతుండేవి. అపురూపమైన సంబంధం తేవాలని అందరికీ వుంది.

ఇంట్లో ఆఖరు పెళ్ళి. మళ్ళీ పదిహేనేళ్ళదాకా శుభకార్యంజరిగే అవకాశం లేదు. అన్నలూ, అక్కలూ అందరూ మాధవి పెళ్ళి చుట్టూ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ మధ్య కాలంలో విడుదలైన హిందీ సినిమాలు రెండు మూడు వాళ్ళ ఆశల్నీ, కలల్నీ ఈస్టమన్ కలల్లోకి దించాయి. ఆడపడుచులూ, ఒదినలూ, మరుదులూ, సరసాలూ, సంబరాలు, నవ్వులూ, వేళాకోళాలు, ఆటపాటలు - డబ్బుంటే దేనికి లోటు?

కొత్తగా ధనికవర్గంలోకి చేరిన చలపతిరావు కుటుంబం వంటి కుటుంబాలకు ఆ సినిమాలు ఆదర్శమైపోయాయి. ఒక్కోరూ పదేసిసార్లు ఆ సినిమాలు చూశారు.

ఇంతకు ముందు చెయ్యని పండుగలూ, సీమంతంలాంటి పేరంటాలూ చెయ్యాలని తహతహలాడుతున్నారు.

తన కూతుళ్ళు పుష్పవతులైతే ఎలాంటి పేరంటం లేకుండా స్నానం చేయించి ఇంట్లోకి రప్పించిన రామలక్ష్మి ఇప్పుడు మనవరాళ్ళకు ఎప్పుడు పదకొండో యేడు వస్తుందా ఎప్పుడు ఓణీలిచ్చే పండగ పెద్ద యెత్తున చేద్దామాని చూస్తోంది.

పదకొండేళ్ళ వయసులో కూడా గోచీ పెట్టుకుని తిరిగిన చలపతిరావు మనవలకు పంచెలిచ్చే వేడుక ఎంత ఘనంగా జరపాలా అని ఆలోచిస్తున్నాడు.

అంతా డబ్బులో వుంది. మధ్యతరగతి మెట్టు ఎక్కేసి పై తరగతి మెట్టు మీద ఓ కాలు పెట్టిన అనేక మంది తమ డబ్బుని యెట్లా ప్రదర్శించాలా అని తహతహలాడుతున్నారు. వాళ్ళకి పెళ్ళిళ్లూ పేరంటాలూ తగిన అవకాశాలు. అవి ఎంత ఘనంగా జరిపితే సంఘంలో అంత హోదా - చలపతిరావు కుటుంబానికి వెంటనే అందివస్తున్న అవకాశం మాధవి పెళ్ళి. కల్యాణీ, సుమిత్ర ఈ మధ్య కాలంలో రాసుకున్న ఉత్తరాల నిండా మాధవి పెళ్ళి కబుర్లే.

ఏ నగలు? ఎట్లాంటి చీరెలు? అసలు మొత్తం పెళ్ళి సంబరమంతా పూర్తయ్యేసరికి ఎన్ని కొత్త చీరెలు కావాలి.

నిశ్చితార్థానికి పెద్ద పట్టుచీరె కావాల్సిందే. పెళ్ళి కంటే ఇవాళా రేపు నిశ్చితార్థమే గ్రాండ్‌గా జరుపుకుంటున్నారందరూ. తామూ ఎవరికీ తగ్గకూడదు. పెళ్ళికూతుర్ని చేసే రోజూ, గౌరిపూజ చేసేటపుడు, అంపకాలు - ఇట్లా అసలు పెళ్ళి ముహూర్తం కాక పది సందర్భాలు సృష్టించుకున్నారు. వాటన్నిటి గురించీ వివరంగా ఉత్తరాలు రాసుకున్నారు. ఫోనుల్లో మాట్లాడుకున్నారు. వదినలతో సంప్రదించారు. ఇవన్నీ సంబంధం కుదరక ముందు నుంచే జరుగుతున్నాయి.

సంబంధం కుదిరిందని చలపతిరావు చెప్పగానే అందరూ ఎగిరి గంతేశారు. నగల డిజైన్లూ, చీరెల రంగులు, నాణ్యాలూ అన్నిటి గురించి సమాచారాలూ కుప్పలు తెప్పలుగా రప్పిస్తున్నారు.

మోహన్ మిగిలిన విషయాలు ఎట్లా వున్నా పెళ్ళి భోజనాలలో ఒక్కొక్కరికీ ఒక మినరల్ వాటర్ బాటిల్ పెట్టాల్సిందేనన్నాడు.

చలపతిరావు అది ముందునుంచీ అనుకుంటున్నదే - వాళ్ళ వూరి చుట్టూ కొల్లేరున్నా చిన్నతనంలో వాననీళ్ళు పట్టుకు తాగాల్సి వచ్చిన పరిస్థితి. వూళ్ళోజనం ఇంకా ఆ బురదనీరూ, వాననీరే తాగుతున్న సంగతీ అయినేనాడో మర్చిపోయాడు. ఇవాళారేపూ డబ్బున్న వాళ్ళ పెళ్ళిళ్ళలో పెట్టే మినరల్ వాటర్ బాటిల్సూ - ఆ పద్ధతి ఆయనకు బాగా నచ్చుతోంది. అందువల్ల కూతురిపెళ్ళికి అదే పద్ధతిపెట్టాలని కొడుకు చెబితే ఆయనకు ఉత్సాహం వచ్చింది. కొడుకుని చూస్తే గర్వమూ కలిగింది. తన రక్తం అనుకుని పొంగిపోయాడు. మాధవి పరీక్షలై వచ్చి రెండు రోజులు విశ్రాంతిగా వున్న తర్వాత మూడోరోజు లాంఛనంగా పెళ్ళి చూపులు అనుకున్నారు. మాధవి ఫోటో వాళ్ళు చూసి ఇష్టపడ్డారు. అబ్బాయి నాలుగేళ్ళ నుంచీ అమెరికాలో వుంటున్నాడు గాబట్టి వాళ్ళకి ఇటీవలి ఫోటో మంచిది దొరకలేదు. పాత ఫోటో చూపించారు. ఆ ఫోటో చూస్తే అబ్బాయి కమలహాసన్ చిన్న తమ్ముడులా వున్నాడు. రంగు పసిమి అని వాళ్ళు చెప్పారు. పిల్లాడి తలిదండ్రులూ, అక్కలిద్దరూ, తమ్ముడూ మేలిమి బంగారాల్లా మెరిసిపోతూనే వున్నారు.

ఇంకా ఆలోచించేదేమిటి? మాధవి పరీక్షలు రాసి రావటం కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. ఆ అబ్బాయి కూడా అదే రోజు అమెరికా నుంచి విమానం దిగుతున్నాడు. అయ్యే పెళ్ళికి అన్నీ ఇలానే కలిసివస్తాయి.

మాధవి వచ్చేసింది.

పరీక్షలు రాసి వచ్చిన అలసట ముఖంలో కనిపిస్తోంది.

"పెళ్ళి చూపులకు ఈ అవతారంలో వుంటే ఎలా? ఈ రెండ్రోజులూ బాగా తిని హాయిగా నిద్రపో" అంది సుమిత్ర మాధవి కళ్ళకింది నలుపుని పరీక్షగా చూస్తూ.

మాధవి ముఖం చిట్లించి "పెళ్ళి చూపులేంటి" అంది.

"అబ్బా - పెళ్ళి చూపులంటే యేంటో తెలియదా? ఇంత చదువులోనూ ఎక్కడా ఆ మాటే తగల్లేదా?" అంది లత కొంటెగా.

ఒదిన మాటలకు మాధవి ముఖం మరింత చిట్లించింది.

"పెళ్ళి చూపులు నీకేనే పిచ్చిముఖమా - అతను అమెరికాలో కంప్యూటర్ ఇంజనీర్ - ఇవాళే వస్తున్నాడు. మీ హనీమూన్ స్విట్జర్లాండ్‌లో" - కళ్యాణి ఒక్క గుక్కతో ఇన్ని

విషయాలు చెప్పినందుకు సంతోషపడుతూ ఆయాసపడింది.

"నిశ్చితార్థం వారం రోజుల్లోపుగా జరగాలని చెప్పవేం" అంది సుమిత్ర చెల్లెలితో పోటీపడుతూ.

మాధవి కళ్ళకింద నలుపు ముఖమంతా పాకింది.

"అదేంటి ? సిగ్గుతో ముఖం ఎర్రబడుతుందంటారు. మా మరదలు ముఖం నల్లబడిందేవిటి?"అన్నాడు కళ్యాణి భర్త.

"కట్నం ఎంతిస్తున్నారు." అంది మాధవి సీరియస్‌గా.

అందరి గుండెలూ గతుక్కుమన్నాయి. కట్నం తీసుకునే వాడిని చేసుకోనంటుందా. ఈ చదువులు ఆడపిల్లల్ని ఒకోసారి ఇట్లాంటి తెలివితక్కువ ఆలోచనల్లోకి దించుతాయి.

ఐనా దీనికి ఇప్పుడీ ప్రశ్న ఎందుకు? చెప్పాలా ఒద్దా అనే సంశయంతో అందరూ రెండు నిమిషాలు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"ముందు పెళ్ళికొడుకు నీకు నచ్చాలిగా - కట్నం సంగతి తర్వాత - పెళ్ళి చూపులు కానియ్ -" అన్నాడు చిన్నబావ.

"మీ అందరికీ సంబంధం నచ్చింది కదా?"

"నచ్చింది" కల్యాణి అందరి తరపునా చెప్పేసింది.

"ఐతే నాకూ నచ్చుతుంది" నవ్వింది మాధవి.

అందరూ కాస్త తేరుకున్నారు.

"కానీ కట్నం సంగతేమిటి? మీరేమో బోలెడు కట్నాలతో పెళ్ళిళ్ళు చేసుకున్నారు. ఆఖరిదాన్నని నాకు అన్యాయం చెయ్యరు గదా - కట్నం లేకుండా ఒదిలించుకుందామని చూడరు గదా -".

మాధవి మాటలకు అందరి ముఖాలూ పెద్ద రిలీఫ్‌తో విప్పారాయి.

మాధవి తెలివైందని అందరికీ తెలుసుగానీ ఇంత గడుసైందని ఎవరూ అనుకోలేదు.

"ఊరికే అత్తవారింటికి పంపిస్తే ఫూరుకుంటావామ్మా? పదిలక్షల క్యాష్ నిశ్చితార్థం నాడే పళ్లెంలో పెట్టెయ్యాలి. ఇక అన్ని లాంఛనాలు ఆరాగా అడిగి పుచ్చుకుంటున్నారు. మీ అక్కలిద్దరి పెళ్ళిళ్ళకూ ఇచ్చిన కట్నకానుకలూ, పెళ్ళి ఖర్చులూ అన్నీ కలిపితే గాని నీ పెళ్ళి ఖర్చుకు చాలదు. తృప్తేనా?" అంది పెద్ద వదిన లత కాస్త ప్రేమ మరింత నిష్ఠూరం కలగలిపి.

"చాలా తృప్తి. చాలా ?" అంటూ నవ్వింది మాధవి.

"చాలు గానీ - ఈ రెండ్రోజులూ బాగా నిద్రపో. ఆ కళ్ళకింద నల్లగా వుంది. రేపు

బ్యూటీ పార్లర్‌కు వెళ్ళి ఫేషియల్ చేయించుకో, నీ ఫొటో వాళ్ళందరికీ నచ్చింది గానీ నువ్వు ఫొటోలో కంటే బాగుంటావని చెప్పాం'' రేఖ అంతవరకూ మాట్లాడకుండా వున్నది తనూ మాట కలిపింది.

మాధవి నవ్వుతూ స్నానానికి వెళ్ళింది.

స్నానం అయ్యాక తండ్రి కోసం ఎదురు చూస్తూ కూచుంది. అందరూ భోజనాలు చేస్తున్నా 'నాన్నతో కలిసి తింటానని' అలాగే కూచుంది.

ఆ రోజు చలపతిరావు భోజనానికి వచ్చేసరికి రెండు గంటలు దాటింది. అందరూ మధ్యాహ్నపు సుఖనిద్రలో వున్నారు. రామలక్ష్మి కూడా ఒడ్డన పని మాధవికి అప్పగించి పడుకుంది.

మాధవి తండ్రికీ తనకూ ఒడ్డించింది. కుశల ప్రశ్నలు అయ్యాక చలపతిరావు చేపలకూర తినే ఆనందంలో నిండా మునిగివుండగా మాధవి మెల్లగా అడిగింది.

"నాన్నా! నాకు పది లక్షలు కావాలి"

చలపతిరావుకు అర్థం కాలేదు. అప్పుడే రామలక్ష్మి కూడా నిద్ర లేచి వచ్చింది.

"ఏంటమ్మా" అన్నాడు చలపతిరావు చేపముల్లు నేర్పుగా నోట్లోంచి తీస్తూ.

"నాకు పదిలక్షలు కావాలి నాన్నా"

ఆశ్చర్యం దిగమింగుకుని "ఎందుకమ్మా" అనడిగాడు.

"పొలం కొనాలి" మాధవి పెరుగులోకి వచ్చేసిందప్పుడే.

"పొలమా?"

"ఔను - విజయనగరం దగ్గర సాలూరు అని వుంది. అక్కడికి దగ్గర్లో ఇరవై ఎకరాలు మంచి భూమి అమ్మకానికి వచ్చింది. కొనాలి"

చలపతిరావుకి తనకు పిచ్చెక్కిందో కూతురికి పిచ్చెక్కిందో అర్థం కాలేదు. రామలక్ష్మికి అంతకంటే అయోమయంగా ఉంది.

"పొలం కొనటమేమిటి? ఏం చేసుకుంటావు? రెండునెలల్లో అమెరికా వెళ్ళబోయేదానివి"

"నేను అమెరికా వెళ్ళను" మాధవి గొంతులో కొంచెం బెరుకూ - దాన్ని వెనక్కు నెట్టాలనే గట్టి ప్రయత్నం విన్పించాయి.

"అమెరికా వెళ్ళవా? మరి -" చలపతిరావుకి చిరాకు రాబోతోంది.

"మరి లేదు. ఏం లేదు. నేను పెళ్ళి చేసుకోను. వ్యవసాయం చేస్తాను. పొలం కొనుక్కుని అందులో రకరకాల ప్రయోగాలు చేస్తా. పంటలు పండిస్తా. నాకిపుడు పెళ్ళి

చేసుకోవాలని లేదు. వ్యవసాయం చెయ్యాలని వుంది."

చలపతిరావుకి కోపం తెచ్చుకోవాలని కూడా తెలియలేదు కాసేపు.

చిన్నపిల్లలు ఆకాశంలో చందమామ కావాలని అడిగితే తల్లులెలా చూస్తారో అట్లా చూశాడు మాధవి ముఖంలోకి.

కానీ మాధవి ఆ చూపుని తుడిచేసింది.

మళ్ళ మళ్ళీ తన నిర్ణయాన్ని చెప్పింది. పెళ్ళికి కట్నంగా ఇచ్చే పదిలక్షలూ తనకు ఇచ్చెయ్యమంది. ఆ పదిలక్షలతో తను చెయ్యబోయే వ్యవసాయం గురించి పదే పదే చెప్పింది.

ఆ ఇంటి పునాదులు కదిలిపోయాయి.

ఇంట్లో అందరూ మొదట మాధవి మాటల్ని పిచ్చితనంగా కొట్టెయ్యటానికి అన్ని రకాలుగా ప్రయత్నించారు.

మాధవి ఒక్క ప్రయత్నాన్ని కూడా పడనివ్వకుండా తను ఈ విషయంలో ఎంత సీరియస్‌గా వుందో తడబడకుండా, సంశయం లేకుండా చెప్పింది.

"పోనీ పెళ్ళి చేసుకుని మీ ఆయన్ని ఒప్పించుకుని ఈ పని చేసుకో" అన్నారు.

"అతనెవరో కొత్త మనిషి. అతన్ని ఒప్పించడం యేమిటి? అతను అంగీకరించటం లేకపోవటం మీద నా ప్రోగ్రాం అధారపడటం యేమిటి? అమెరికాలో కంప్యూటర్ ఇంజనీరు నన్ను కూడా అమెరికా తీసికెళ్ళి కంప్యూటర్ ట్రైనింగ్ ఇప్పిస్తాడు గానీ ఇక్కడ పల్లెటూర్లో వుండీ వ్యవసాయం చెయ్యమంటాడా? మీకే ఇది మింగుడు పడటం లేదు. అతనికెలా అర్ధమవుతుంది. అసలయినా అసలు విషయం నేనిపుడు పెళ్ళి చేసుకోను. పెళ్ళి కంటే ముఖ్యంగా నేను జీవితంలో సాధించాల్సింది ఎంతో వుంది."

"ఏంటి నువ్వు సాధించేది? మట్టి పిసుక్కుంటూ కూచోటమా?"

చలపతిరావుకి కోపం క్షణక్షణానికి పెరిగిపోయింది.

"ఔను. ఆ పని నాకిష్టం. నాకు మట్టంటే ఇష్టం. ఆ మట్టితో అద్భుతాలు చెయ్యొచ్చని నా విశ్వాసం."

మాధవికి పెళ్ళికి కాదు గదా పెళ్ళి చూపులకు కూడా ఒప్పించలేమని అందరికీ అర్ధమైంది.

మాధవికి ఒంట్లో బాగోలేదనీ ఇపుడు రావొద్దనీ, మళ్ళీ కబురు చేస్తామనీ పెళ్ళివాళ్ళకు టెలిగ్రాం ఇచ్చారు.

* * * * *

క్రమంగా వాతావరణం వేడెక్కసాగింది. అమ్మాయి సీరియస్‌గా మాట్లాడుతుందనేది అర్థమయ్యేసరికి ఇంట్లో అందరికీ మతిపోయింది.

శ్రీకాకుళం జిల్లా ఎక్కడా? హైదరాబాదెక్కడ? అక్కడ ఓ మారుమూల కుగ్రామంలో ఈ పిల్ల ఒక్కత్తీ వెళ్ళి వ్యవసాయం చేస్తుందా?

"అసలెట్లా పంపిస్తాం నిన్ను? నువ్వక్కడ ఒక్కదానివి వున్నావనుకుంటే మాకిక్కడ నిద్రెలా పడుతుంది? మా గురించి ఆలోచించవేం ?"

చలపతిరావు మాధవి మీద వున్న ప్రేమంతా తెచ్చుకుని ఆమెతో వాదించి ఒప్పించాలని చూస్తున్నాడు.

మాధవి దానిని గమనించే ప్రయత్నం కూడా చెయ్యనిదానిలా "నాకు నీ మాటలు వింటుంటే నవ్వొస్తోంది నాన్నా" అని తీసిపారేసింది.

అందరికీ అరికాలి మంట నెత్తికెక్కినట్టయింది.

"మేం నీ క్షేమం గురించి ఆదుర్దా పడుతుంటే నీకు నవ్వొస్తోందా?" అంత కోపాన్నీ దుఃఖంగా మార్చబోయాడు చలపతిరావు.

"నాన్నా ఇక్కడికి సాలూరు 600 కిలోమీటర్లుంటుంది. కానీ మీరు నన్ను ముక్కూ ముఖం తెలియని ఒక మగవాడితో కొన్ని వేల కిలోమీటర్ల దూరం పంపటానికి సిద్ధమయ్యారు. ఆ భాష, ఆ వాతావరణం ఏమీ నాకు తెలియదు. నేను ఒంటరిగా వుండాలి. అక్కడ నాకేమవుతుందోనని బెంగ మీకు లేదు. నేను వెళ్ళాలనుకుంటున్నది మన ఊరు. మన భాష, మన జనం, వాళ్ళతో యెట్లా మెలగాలో నాకు తెలుసు. సమస్యలొస్తే ఎట్లా పరిష్కరించుకోవాలో తెలుసు. మరీ తలకు మించితే ఒక్క ఫోన్‌కాల్ తో నువ్వో, అన్నయ్యో రావొచ్చు. నేనా అమెరికా వెళ్ళి నాలుగ్గోడల మధ్య నిశ్శబ్దంగా వుంటే క్షేమంగా వున్నట్టా ?'

"నువ్వక్కడ ఉద్యోగం చెయ్యి. నాలుగ్గోడల మధ్య వుండటం యేంటి?"

"నేను చెయ్యను?"

"ఎందుకు? ఇక్కడింత కష్టపడతానంటున్న దానివి అక్కడ ఉద్యోగం చెయ్యక పోవటం యేంటి?"

"నాకు వ్యవసాయం చెయ్యాలని వుందంటే మీ కర్థం కాదేంటి?"

"నీకు అమెరికా వెళ్ళటం ఇష్టం లేదా? ఇంకో సంబంధం ఇక్కడి సంబంధం చూస్తే పెళ్ళి చేసుకుంటావా? అప్పుడతన్ని ఒప్పించుకుని వ్యవసాయమో యేదో చేసుకో".

చంద్రం చెల్లెల్ని సానుభూతిగా అర్థం చేసుకోవాలని చూశాడు.

"నా పెళ్ళికి యెవరూ సంబంధాలు చూడొద్దు. నాకు చేసుకోవాలనిపించినపుడు చేసుకొంటాను. ప్రస్తుతం నా ప్రయారిటీ వ్యవసాయం. ముందు నాలుగైదేళ్ళు నేను అనుకున్నవన్నీ సాధించాక అప్పుడాలోచిస్తాను ఆ విషయం. ఈ సంబంధం గురించి అందరూ మర్చిపోతే మంచిది?"

మాధవి అక్కడ్నించి వెళ్ళిపోయింది. గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుని యేడుస్తూ పడుకుంది.

ఇదంతా ఇట్లాగే జరుగుతుందనీ, ఎంతో ఘర్షణ పడక తప్పదనీ ఆమెకు ముందునుంచీ ఖచ్చితంగా తెలిసినా అదంతా భరించాల్సి రావటం చాలా కష్టంగా వుంది.

కానీ పొలం, వ్యవసాయం అవన్నీ తనను బాగా పట్టుకుని గుంజుతున్నాయి.

చదువుల్లో భాగంగా తను వెళ్ళిన పొలాలూ, వాటిని చూస్తుంటే తనకు కలిగిన ఆనందం, జీవితాంతం ఆ పొలాల్లో వుండాలని తన లోపల్నించీ పుట్టుకొచ్చే కోర్కె వీటి నణుచుకోవాలని లేదు.

ఎందుకు అణుచుకోవాలనే ప్రశ్న తన మానుషాన్ని తట్టి లేపుతోంది. ఏదో ఒక ఉద్యోగం చెయ్యటం, ఎవడో ఒక మగాడ్ని పెళ్ళాడటం తన సంపాదన వాడి సంపాదనకు తోడుకావటం, వాడి పిల్లలకు తల్లిగా అట్లా సుఖంగా బతికే వాళ్ళుండొచ్చు. కానీ తనకా బతుకు సుఖానివ్వదు.

ఈ పాడు ప్రపంచంలో సుఖాలకు కూడా ఒక నమూనా తయారైంది. ఎవరి సుఖం వాళ్ళది కాకుండా పోయింది. వ్యవసాయం చెయ్యటం సుఖం కాదు. ఉద్యోగం చెయ్యటం సుఖం. కాలినడక సుఖం కాదు. కార్లో వెళ్ళటం సుఖం. డబ్బు, వస్తువులు, చెమటతో మట్టితో పనిలేని జీవితం ఇవీ సుఖాలు! ఈ సుఖాల్ని కాదన్నవాళ్ళు పిచ్చివాళ్ళు. తెలివితక్కువ వాళ్ళు. అసమర్థులు. చేతకాని వాళ్ళు. ఏ వెధవ పని చేసైనా సరే వస్తువుల్ని డబ్బునీ సంపాదించిన వాళ్ళు సమర్థులు.

మగవాళ్ళు ఈ సమర్థతను మంచిపనో, చెడ్డ పనో యేదో ఒకటి చేసి నిరూపించు కుంటారు.

ఆడవాళ్ళు ఒక మొగుడ్ని సంపాదించుకుని అతన్ని కాస్త తనతో మంచిగా వుండేలా చూసుకుంటే చాలు - అన్నీ వచ్చేస్తాయి.

అందరికీ ఇదే ఆలోచన. తన ఫ్రెండ్స్ అందరూ పెళ్ళి కోసం తహతహలాడుతున్న వాళ్ళే - వాళ్ళకి సంబంధం దొరికితే భూమ్మీద నిలవరు.

పట్టు చీరెలు కడతారు. వెర్రెత్తినట్లు అలంకరించుకుంటారు. బుగ్గలకు రోజ్ రాసి నవ్వినప్పుడల్లా సిగ్గు అభినయిస్తూ నానావేషాలు వేస్తారు.

తనకదంతా ఎలర్జీ.

అమ్మా నాన్నా అందర్నీ బాధ పెట్టటం ఎంత బాధగా వున్నా తన ఆలోచనే సరైనది అనిపిస్తోంది గానీ తప్పు చేస్తున్నట్లనిపించటం లేదు.

ఇదంతా ఎప్పటికి తెలుతుంది? తను పొలం సంపాదించగలుగుతుందా. మాధవికి ఇంత కష్టంలో తనకు ఎవరూ లేరే - తనను అర్థం చేసుకుని సపోర్టు చేసే వాళ్ళెవరూ లేరే అనే బాధయెక్కువైంది. రెండురోజులపాటు ఆ యింట్లో యెవరూ యెవరితో మాట్లాడు కోలేదు. మూడో రోజు రామలక్ష్మి వచ్చి మాధవితో

"మీ నాన్న రెండ్రోజుల్నించీ అన్నం తినలేదే! ఎందుకిట్లా వేధిస్తావు? చెప్పినట్లు విను" అంది యేడుస్తూ.

"నాన్న రెండు రోజులు అన్నం మానేసినందుకుగాను నేను నా మొత్తం జీవితాన్ని మార్చేసుకోవాలా? నా జీవితం విలువ నాన్న రెండు రోజుల అన్నమా?"

మాధవి మాటలకు రామలక్ష్మికి పట్టరాని కోపం వచ్చి కూతుర్ని శపిస్తూ వెళ్ళిపోయింది.

మర్నాడు చలపతిరావు మామూలుగా భోజనం చేశాడు.

భోజనం అయ్యాక మాధవి యేమీ జరగనట్లే వెళ్ళి అడిగింది.

"నాకు డబ్బు కావాలి నాన్నా. అక్కడ బేరం సెటిలయింది. నెలలోపలనే రిజిష్టరు చేయించుకోవాలి".

చలపతిరావు మాట్లాడలేదు.

మళ్ళీ అడిగింది. మళ్ళీ మాట్లాడలేదు.

'నాన్న- ఏదో ఒకటి చెప్పు. డబ్బు కావాలి.'

"నేను నీకు పైసా యివ్వను. ఏం చేసుకుంటావో చేసుకో" విసురుగా అన్నాడు చలపతి.

"ఎందుకివ్వవు?" మాధవి తాడోపేడో తేల్చుకునే దానిలా కూచుంది.

"ఎందుకిస్తాను? ఎందుకివ్వాలి? నాకిష్టం లేదు యివ్వను?"

"అన్నయ్యలకూ, అక్కయ్యలకూ యిచ్చినప్పుడు నాకెందుకు యివ్వవు?"

"వాళ్ళు నా మాట విన్నారు. అక్కయ్యల పెళ్ళికి యిచ్చాను. నువ్వు పెళ్లి చేసుకుంటే నీకూ యిస్తాను. అన్నయ్యలకు ఇళ్ళు కట్టుకోటానికి యిచ్చాను."

"నాకు పొలం కొనుక్కోటానికి యివ్వు"

"ఇవ్వను"

"అలా కుదరదనుకుంటా, ఆస్తిలో నా వాటా నాకు రావాలి"

"నా స్వార్జితం. నా యిష్టం. నా ప్రాణమున్నంత వరకూ ఎవరికీ యివ్వనవసరం లేదు. చచ్చేప్పుడు ఎవరికి రాస్తే వాళ్ళకే పోతుంది. నీకు పైసా దక్కకుండా విల్లు రాసిన తరవాత గాని నేను చావను".

"ఎందుకు నాన్నా నా మీద అంత కోపం?"

"ఎందుకో నీకు బాగానే తెలుసు"

"తెలియటం లేదు. నిజంగా తెలియటం లేదు. పైగా నీ తెలివి తక్కువ తనానికి ఆశ్చర్యంగా వుంది" మాధవి మాటలు రామలక్ష్మి భరించలేక

"ఏంటే ఆ మాటలు -" అని ఆపాలని చూసింది.

మాధవి ఆగే స్థితిలో లేదు.

"నిజంగా తెలివితక్కువ తనమేనమ్మా. నన్ను చేసుకోబోయేవాడికి లక్షల రూపాయలు నిరభ్యంతరంగా ధారపోయటానికి సిద్ధంగా వున్నారు. పెళ్ళి హంగామా కోసం లక్షల రూపాయలు మురికి నీళ్ళు పారబోసినట్లు పారబోయటానికి సిద్ధంగా వున్నారు. ఆ చేసుకునేవాడు నన్నూ నా డబ్బునీ తగలేస్తాడేమోననే అనుమానం కూడా మీకు రాదు.

నేను పొలం కొంటాననంటున్నాను. భూమి విలువ పెరుగుతుందనే గ్యారంటీ వున్నా నాకు యివ్వటానికి మీరు సిద్ధంగా లేరు. ఎందుకు? ఎందుకు?"

మాధవి యేడుస్తూనే మాట్లాడుతోంది.

"నువ్వు ఆడదానివి. పెళ్ళి చేసుకుని పిల్లల్ని కనాలి. నీ భర్త యిష్టమైతే ఏదో ఓ ఉద్యోగం చేసి వేణ్ణీళ్ళకు చన్నీళ్ళుగా సంపాదించుకోవచ్చు. అంతేగాని పెళ్ళీ పెటాకులూ లేకుండా నీ యిష్టం వచ్చినట్టు నువ్వు బతుకుతానంటే మేం ఊరుకోం. నీకు డబ్బు యివ్వం."

చలపతిరావు కోపానికి అల్లుళ్ళు కూడా బిక్కచచ్చిపోయారు. కానీ ఆయన కోపంతోపాటు మాధవి పట్టుదల కూడా పెరుగుతోంది.

"నాన్నా- నాకు పెళ్ళంటే వ్యతిరేకత యింతవరకూ పెద్దగా లేదు. దాన్ని గురించి పెద్దగా ఆలోచించను కూడా లేదు. కానీ ఆడదానికి పెళ్ళే గతి అని మీరంతా అంటూంటే, అట్లా తప్ప మరోరకంగా బతక్కూడదని శాసిస్తుంటే నాకు ఈ పెళ్ళంటే అసహ్యంగా వుంది. నేను చచ్చినా పెళ్ళి చేసుకోను".

"నువ్వేం చేస్తావో నాకు తెలియదు. నా దగ్గర్నించీ ఒక్క పైసా కూడా ఇక నీకు రాదు. రాముడూ - దాని ఒంటి మీద బంగారం తీసేసుకో".

చలపతిరావు వెళ్ళిపోయాడు.

రామలక్ష్మి వంటింటి గడప మీద కూచుని యేడుస్తోంది.

సుమిత్ర చప్పున కదిలివచ్చి "అమ్మా - చెల్లాయి గాజులూ, గొలుసూ కమ్మలూ తీసేసుకోవే" అంది.

రామలక్ష్మి వెక్కిళ్ళు పెడుతూనే "ఊరుకోవే - నీకు మతిపోయింది" అని కసిరింది.

"కాదమ్మా. అవి అమ్ముకుబతకొచ్చని మాధవి యింట్లోంచి వెళ్ళిపోతే ఏం చేస్తాం. దాన్నెలాగైనా ఆపాలి. బైటికి పోనీయకూడదు. లేకపోతే నాన్న బంగారం తీసేసుకోమని ఎందుకంటాడు."

రామలక్ష్మికిపుడు యిదివరకు లేని భయం పట్టుకుంది. ఏదో మంకుపట్టు పడుతుందనుకుంటే ఈ పిల్ల ఇంట్లోంచి కూడా వెళ్ళిపోతుందా?

"నేను దాన్ని బంగారం తీసివ్వమని అడగలేనే. అమ్మ యివ్వమంటోందని నువ్వే అడిగి తీసుకో" అంది.

కూతురు ఏ అపాయాల్లోకి వెళ్ళబోతుందోననే కంగారుతో ఆమె కాళ్ళూ, చేతులూ చచ్చుబడినట్లయ్యాయి.

శాంతి మాధవిని వెతుక్కుంటూ వెళ్ళే సరికి మాధవి గాజులూ, గొలుసూ తీసేసి కమ్మలు కూడా తీస్తోంది.

సుమిత్ర అక్కడే నిలబడి అవి తీసుకుని తన పెట్టెలో పెట్టేసుకుంది.

మాధవికి ఆ యింట్లో ఒక్క క్షణం వుండాలనిపించలేదు.

కానీ ఎక్కడికి వెళ్ళటం ఏం చెయ్యటమన్నది తెలియటం లేదు.

హాల్లో ఈ టెన్షన్ భరించలేని అల్లుళ్ళూ, కోడళ్ళూ వాళ్ళకిష్టమైన "హమ్ ఆప్ కే హై కౌన్" సినిమా పెట్టుకుని చూస్తున్నారు.

మాధురి దీక్షిత్ "దీదీ తేరా దేవర్ దివానా" అని పాడుతుంటే వాళ్ళందరికీ తమ జీవితాల్లో ఆ సన్నివేశాన్ని చూసుకునే అదృష్టాన్ని మిస్ చేసిన మాధవి మీద మళ్ళీ కొత్తగా కోపం వచ్చింది.

మాధవికి మాత్రం "హమ్ ఆప్‌కే హై కౌన్" అనే ప్రశ్న అందర్నీ అడిగి నేను మీ ఎవరికీ ఏమీ కాను. మీరు పెళ్ళాట ఆడదల్చుకున్నప్పుడు పెళ్ళి కూతురు బొమ్మని. పెళ్ళి కూతురుగా వుండనన్నానని ఆట ఆపేసి నన్నవతల పారేస్తున్నారు - అని చెప్పాలనిపించింది.

ఆ పాటల్నీ నవ్వుల్నీ భరించలేక పెరట్లో బాదం చెట్టు నీడన కూచుంది. చాలాసేపు ఆలోచిస్తూ కూచుంది. తెలియకుండానే నిద్రపట్టి ఆ చెట్టు మొదట్లోనే ఒరిగింది.

సాయంత్రం నాలుగు గంటలవుతుండగా వెంకాయమ్మ మెల్లిగా కర్రపోటు వేసుకుంటూ పెరట్లోకి వచ్చి మాధవిని చూసింది.

కర్రతో మెల్లిగా మాధవి భుజాల మీద తట్టింది. మాధవి ఉలిక్కిపడి లేచింది. ఎదురుగా నాయనమ్మను చూసే సరికి స్థిమితపడి లేచి కూచుంది.

వెంకాయమ్మ కూడా మనవరాలి పక్కనే కూలబడి "ఏంటి పెళ్ళి కూతురివి - ఇట్టా ఎండనబడి నిద్రపోతున్నా" అంది.

మాధవికి చర్రున కోపం వచ్చి ఆ ముసలామె మీద యింతెత్తున లేచింది.

"నేనేం పెళ్ళికూతుర్ని కాదు. పెళ్ళి చేసుకోవటం లేదు. ఇంకోసారి ఎవరన్నా పెళ్లి మాటెత్తారంటే చంపేస్తాను".

వెంకాయమ్మ కళ్ళ కింద ముడతల్లోంచి ఆశ్చర్యపు గీతలు పైకి ఉబ్బాయి.

"ఏం పెళ్ళి కొడుకు నచ్చలేదా?" అంది మెల్లగా.

"పెళ్ళి కొడుకు ఎవడో ఎవడు చూశాడు. నాకసలు పెళ్ళే వద్దు. నేను పొలం కొనుక్కుని వ్యవసాయం చేస్తాను. ఆ దరిద్రపు పెళ్లికొడుక్కు లక్షలిస్తారంటగానీ నాకొక్క పైసా యివ్వరంటా. అంతా నీ కొడుకు స్వార్జితమంట. నేను వీధుల వెంట అడుక్కుతిన్నా ఫరవాలేదు గానీ పెళ్ళి చేసుకోకపోతే యింట్లోంచి గెంటేస్తారంట. చూడు నా గాజులూ, గొలుసూ అన్నీ తీసేసుకున్నారు" ఏనాడూ మాట్లాడని నాయనమ్మ ఒళ్ళో తలపెట్టుకు యేడ్చింది మాధవి. తనకో మనిషి అవసరం ఎంత వుందో ఆ పిల్లకపుడు తెలిసి వచ్చింది.

అ ముదివగ్గు స్పర్శే నాకింత వూరటగా వుంటే నన్ను అర్థం చేసుకుని బలం యిచ్చే వాళ్ళు ఒక్కరుంటే ఎంత బాగుండేది. ఈ కష్టాన్ని దాటటం ఎంత తేలికయ్యేది అనే ఆలోచన వచ్చి ఆ అమ్మాయి మరింతగా యేడ్చింది.

వెంకాయమ్మకూ తన వాళ్ళ స్పర్శ దూరమై యేళ్ళయిందేమో మాధవి తలను ఆప్యాయంగా తడుతూ

"ఏడవబాకమ్మా - యేడవబాకు" అని తనూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

* * *

"ఇల్లంతా మాధవి సమస్యతో వుడికిపోతుంటే మీ నాయనమ్మేంటి మధ్యలో" ఆశ్చర్యంతో అన్నాడు సుమిత్ర భర్త.

"ఏంటో - ఈ యింట్లో ఎన్నడూ కనీ వినీ ఎరగనివన్నీ జరుగుతున్నాయి. మా నాయనమ్మ, అందరూ ఒకచోట జేరండి. నేను మాట్లాడాలా అన్నపుడు ఆమె ఆర్డరింగ్ చూసి నాకు మూర్ఛ వచ్చినంత పనయింది. ఇదేదో మంచికి రాలా - ఠండి ఈ ముసలమ్మ

ఏం పెటకం పెడుతుందో" - సుమిత్ర భర్తకు షర్టు అందించింది. "అసలు నా అనుమానం మాధవి ఏ కులం తక్కువవాడినో - బహుశ మాలమాదిగ కుర్రాణ్ణి ప్రేమించి వుంటుంది. మనం ఒప్పుకోమని ఎట్లాగైనా పది లక్షలు మూటగట్టుకుపోదామని పొలమనీ, గిలమనీ పిచ్చి మాటలు మాట్లాడుతోందని నా అనుమానం. మరి మీ నాయనమ్మ గోలేంటో - శలవు పెట్టి మరీ ఈ గొడవలో యిరుక్కున్నాను. నా ఖర్మ" అతను గొణగటం మొదలుపెట్టాడంటే ఒక పట్టాన అపడు.

వీళ్ళిద్దరూ హాల్లోకి వచ్చేసరికి చంద్రం, మోహన్ వాళ్ళ భార్యల్తో సహా ఓ పక్క కుర్చీల్లో కూర్చుని వున్నారు.

రామలక్ష్మి, చలపతీ వారి కెదురుగా కూచుని అందరి వంకా చూస్తున్నారు. కల్యాణీ, మాధవి, నాయనమ్మ కెదురుగా వున్న సోఫాలో కూచున్నారు. సుమిత్రా వెంకట్రావులు వచ్చి కూచుంటుండగానే

"ఊఁ - చెప్పు" అన్నాడు చలపతి. అంతవరకూ అణచిపెట్టుకున్న అసహనాన్ని దాచిపెట్టుకునే ప్రయత్నం కూడా చేయకుండా

వెంకాయమ్మ కొడుకు వంకా, కోడలి వంకా ఓసారి చూసి, మళ్ళీ మనవల్నీ, మనవరాళ్ళనీ, అందర్నీ చూసి -

"చెప్తా - ఇన్నాళ్ళూ నా రోజులు కావులే అని నోరుమూసుక్కూచున్నా. ఇవాళ నా మనవరాలు నా నోరు తెరిపించింది. మా అమ్మ దగ్గర్నించీ నా మనవరాలి దాకా ఈ వందేళ్ళ కథంతా చెప్తా -"

వెంకాయమ్మ కంఠం ఖంగున మోగుతుంటే ఆమెకసలు నోరే లేదనుకుంటున్న మనవలూ, మనవరాళ్ళూ ఒక్కసారి వులిక్కిపడి ఒకర్నొకరు చూసుకున్నారు.

చలపతిరావు మాత్రం -

"ఇప్పుడెందుకీ సోదంతా" అని ఒక్క కసురు కసిరాడు. అసహనాన్ని హద్దుల్లో పెట్టుకోవాల్సిన అవసరం అతనికి లేదు.

ముసలావిడ కొడుకు వంక సూటిగా చూసింది.

"నలభై ఏళ్ళుగా మీ సోదంతా యింటా నేను బతకట్లా. ఒక్కరోజు రెండు గంటలూ నా సొద యింటేమీ పుట్టేం మునగదులే. కిక్కురుమనకుండా యినండి".

ఆవిడ గొంతులోనే కాదు ఆవిడ ముఖంలో కూడా ఒక నిశ్చయం.

అందరికీ అర్థమయింది. ఆమె చెప్పదల్చుకుంది. చెప్తుంది. అది వినక తప్పదు.

వాతావరణం సర్దుక్కూచున్నట్టు -

ఆమె మాటలు గతాన్ని వర్తమానం చేస్తూ - బహుశా వర్తమానాన్నే గతాన్ని చేస్తూ -

"మా అమ్మపేరు అప్పమ్మ - తెలుసుగా. ఆజానుబావురాలు, మంచిబలంగా వుండేది. ఆవిడ గొంతు ముందు నా గొంతెందుకూ పనికిరాదు. ఇంటెనక్కెల్లి ఒక్క కేక పెట్టిందంటే మైలు దూరానున్న చేలో పంజేసేవాళ్ళ చెవుల్లో దూరాల్సిందే.

మా అమ్మ పెళ్ళి చేసుకోలా! అట్టా అదిరి చావమాకండి.

నేనామెకు పెంపుడు కూతుర్ని. పెళ్ళెందుకు చేసుకోలేదంటే - మా అమ్మని కన్నోడే దాని బతుకు బండలు చేశాడు. ఆడి పుటమార -

ఆ సచ్చినోడు పేకాటరాయుడు. ఆ పేకాట పిచ్చితో వున్న పొలమంతా కరారావుడు చేసి, ఆఖరి దెబ్బగా పదిహేను రూపాయలకు మా అమ్మను అమ్మేశాడు. ఆ సంగతి యింటానే అమ్మమ్మ గుండాగి సచ్చింది.

మా అమ్మని కొనుక్కున్న సోమయ్యకి అప్పటికే అరవయ్యేళ్ళ పైబడ్డాయి. ఆడపిల్లల్ని కొనటాలూ, అమ్మటాలూ యిప్పట్లాగే మా కాలంలో కూడా లేవు. అప్పుడుకూడా 'పెళ్ళి' అనే అనేవాళ్ళు.

ఆ సోమయ్య ఎనిమిదేళ్ళ మా అమ్మ మెళ్ళో పుస్తెకట్టాడు.

ఆ... ఆ... మా అమ్మ పెళ్ళి చేసుకోలేదన్నాననేగా - మరి ఆ పెళ్ళి మా అమ్మ చేసుకుందా?

మా అమ్మ బాబున్నాడే - ఆ సచ్చినోడు ఆ సోమయ్యా చేసుకు సచ్చారు. అది మా అమ్మ పెళ్ళెట్టా అవుద్దీ? ఆ పెళ్ళి చేసుకున్న యేడాత్తిరక్కుండానే ఆడు పుటుక్కున సచ్చాడు. పెళ్ళి నాటికే గుండె జబ్బుందన్నారు."

వెంకాయమ్మ ఆయాసం తీర్చుకోటానికన్నట్టు ఆగింది. మాధవి లేచి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి నాయనమ్మకిచ్చి ఆమె కుర్చీ పక్కనే నేలమీద కూచుంది.

"ఆ సోమయ్య కొడుకులు తండ్రి ఆస్తులన్నీ అమ్మేస్తున్నారు. ఊళ్ళో పెద్దమడుసులు మరి ఆ పిల్ల గతేంగావాలని పేచీ పెట్టుక్కూచుంటే మేవంత యింగితం లేనోళ్లంగాదంటా ఎందుకూ పనికిరాని పొలం నాలుగెకరాలు అమ్మపేర్న బెట్టి మిగిలిందంతా అమ్ముకుని చెన్నాపట్నం చక్కాబోయారు. అమ్మ వుంటున్న యిల్లుకూడా దక్కింది. నిండా పదేళ్ళు లేని పిల్ల, ముందూ వెనకా ఎవరూ లేరు. ఇరుగమ్మ పొరుగమ్మ ఆదుకున్నారు.

నోరు మంచిదైతే వూరు మంచిదవుతుందంటారు. ఆ మాట నిజంగాపోతే మా అమ్మ ఎట్టా బతికి బట్టకట్టేది?

నాలుగెకరాల్ని ఓ దారికి తెచ్చుకుని దాంట్లో నాలుగ్గింజలు పండించుకోటానికి పదేళ్ళ పిల్ల నడుం కట్టింది.

నా చిన్నప్పుడు అమ్మకతలు చెప్పినట్లు చెప్పేది నా వయసులో ఆమె పడ్డ కష్టాలన్నీ..........

ఇల్లూ, గొడ్డు, గోదా - పొలం పనీ - ఒక పాలేరుని పెట్టుకుని తనూ ఒళ్ళిరుసుకుని పంజేసుకుని సంభాళించుకొచ్చింది.

నన్ను పెంపకానికడిగేనాటికి అమ్మకు పాతికేళ్ళు దాటాయి...... పనికిరాని నాలుగెకరాలూ పదెకరాల పంట పొలమయింది.

పొద్దున లేస్తే చేలోనే - నాలుగు చెంగులూ పైకి దోపి, పైట భుజం మీదుగా ముందుకు తెచ్చి బొడ్లో దోపేది. చెంగాయి పంచె అయితే మాత్రం ఏం? మడిసి పువ్వులాగుండేది.

ఇంటా బైటా అప్పమ్మంటే అందరికీ హడలే. అప్పమ్మగారి మాటంటే అందరికీ గురే. వారం వారం ఏటనేయించేది. ఏటనెయ్యటమంటే తెలవదా - ఏట పోతుని కోయించి యింటికో కుప్ప పంపేది. నెలకోసారాన్న పందినేయించేది. అప్పమ్మగారు మాంసం కుప్ప పంపిందంటే ఒక్క పిసరుముక్క తక్కువపడదని అందరికీ ఎరికే. ఓ ముక్క ఎక్కువుండాల్సిందే."

వెంకాయమ్మ చిన్నతనంలోకి వెళ్ళి మాంసం కుప్పలు యింటింటికీ పంపుతున్నట్టుగా ఆనందంగా నవ్వుకుంది.

చలపతిరావుకైతే ఆ ముసల్దాని నోరునొక్కి యిదంతా మర్చిపోయేలా ఒక్క స్కాచ్ బాటిల్ తాగేద్దామనే కోరిక పుట్టుకొస్తోంది. బలవంతాన అణుచుకున్నాడు.

రామలక్ష్మికి అత్తగారు ఎందుకీ పురాణం విప్పతోందో అర్థంకాక చిరాకు పుట్టుకొస్తోంది. అల్లుళ్ళున్నారు యింట్లో - ఏదో ఒకటి వాళ్ళకిష్టమైనది వండాలి.

మిగిలినవాళ్ళు కూడా చిన్న సాకు దొరికితే అక్కడ్నించి కదలాలని చూస్తున్నారు. అదేంటోగాని ఫోనన్నా మోగటం లేదు.

వెంకాయమ్మ చెప్పుకుపోతూనే వుంది.

నా చిన్న తనంలో మా అమ్మకంట తడి పెట్టుకోగా నేను చూడలేదు. ఎప్పుడు చూసినా నవ్వుతూ వుండేది. ముఖాన బొట్టులేకపోతే మాత్రమేం ముఖంలోసిరివొలుకుతూ వుంటే -

పొగులంతా పొలంలో ఒళ్ళిరుసుకు పంజేసేది. ఇంటికొచ్చి యేణ్ణీళ్ళు కాగబెట్టుకుని కాగెడు మసుళ్ళు దిమ్మరించుకునేది. గడ్డపెరుగేసుకు అన్నం దిని గురకపెట్టి నిద్దరబోయేది. అవసరంబడితే రాత్రిళ్ళు కూడా పొలంలోనే వుండేది.

ఇక పొలం పనులంటారా - ఆమెకు తెలియంది లేదు.

అమ్మతోపాటు పొలం పోయేదాన్ని. అమ్మెనెకమాల ఎనకమాల తిరుగుతూ పనులన్నీ నేర్చా.

"అప్పమ్మ కూతురు యింటికీ పొలానికి ఆసులోకండెలా ఏం తిరుగుతుందే" అనేవాళ్ళు అమ్మలక్కలు.

పెళ్ళి లేక మా అమ్మ సుఖపడలేదనుకోబాకండి. ఆమె సంబంధాలు. యవ్వారాలూ ఆమెకుండేవి. అయ్యన్నీ ఆమె సుబ్బరంగా చూసుకునేది. - దాన్ని గురించి ఎవురూ నోరెత్తేవాళ్ళు కాదు.

నేను పెద్దమణిసినయ్యాక "అప్పమ్మా కూతురి పెళ్ళి చెయ్యవేమే" అనడిగే వాళ్ళు చుట్టాలూ పక్కాలు.

"ఆ చేసుకు మీరేం అనుబగిత్తన్నారూ - చివాట్లు చెప్పుదెబ్బలేగా. నాకు నా కూతురికీ అయ్యిలేవని మీకు దిగులుగా వుందంటే" అనేది అమ్మ.

"అయ్యో! చివాట్లయినా చెప్పు దెబ్బలైనా ఆడ పుటక పుట్టాక తప్పుద్దెట్టా - పూజ కొద్దీ పురుషుడన్నారు. అల్లుడు కొట్టే దెబ్బలకు దడిసి కూతురికి పెళ్ళి చెయ్యవెట్టా" అంటే

"ఎందుకూ చెయ్యనూ - నా బాబు నాకు చేసినట్టే నేనూ దాన్నో ముసలి ముండాకొడుక్కిచ్చి చేస్తా. ఆడుకాస్తా పుటుక్కుమంటే యిదీ నాలాగే హాయిగా బతుకుద్ది' ' అనేది పకపక నవ్వుతా.

"నీదంతా సోద్దెమే అప్పమ్మా" అని అందరూ నవ్వేవాళ్ళు.

మా అమ్మ నిజంగానే ముసలాడిక్కట్టబెట్టుద్దా అనుకునేదాన్ని.

నా సావాసగత్తెలు యేడిపిత్తావుండేవాళ్ళు.

నన్ను కన్నవాళ్ళ పోరుపడలేక మా అమ్మ నాకు పెళ్ళి చేసింది. ఆయన్ది మా వూరే! మా కన్నాలేనోడు. ఆయనే మా యింటికొచ్చాడు.

మొత్తానికి చానాయేళ్ళకి ఆ యింటికో మగాడొచ్చాడు. అది నాకే యేంటో యిబ్బందిగా అవస్తగా వుండేది. ఇక మా అమ్మకెట్టా వుందో -

ఆయనొచ్చిందగ్గర్నించీ మా అమ్మ బలం సగం తగ్గినట్లయింది. అప్పటిదాకా యేసిన పంటలు కాదని కొత్త పంటలేశాడు. అమ్మ యేమన్నా అంటే

'నీకేం తెలుసు. నాకు తెలుసు' అనేవాడు.

కొత్త పంటలు, కొత్త పంటలనడమే గాని ఆమడిసికి ఎవసాయం తెలియదు. కొత్త పంటల ఎవసాయం అమ్మకీ తెలవదు. మా అమ్మ యేదన్నా చేస్తే అందుకే పాడయిందనే వాడు. చెయ్యకపోతే చెయ్యట్లేదనేవాడు. కూలిమడుసుల్ని పురమాయించినట్లు పురమాయించి తను టవును కెళ్ళి పోయేవాడు.

అమ్మ ఎప్పుడన్నా ఏందయ్యా యిది అంటే గుడ్లురుముతా నా మీదికొచ్చి ఒళ్ళిరిగేటట్టు తన్నేవాడు.

నన్నెక్కడ తంతాడోనని ఎవరికీ జడవని అమ్మ అల్లుడికి జడిసేది.

అమ్మకి రాను రానూ పొలం పనులన్నా యింటి పనులన్నా యిరక్తి పుట్టుకొచ్చింది. అది నేను గుడ్డాకళ్లు పెట్టుకుచూస్తున్నానేగాని యింట్లో మగాణ్ణి ఎదురించలేక పోయేదాన్ని.

మగాడులేకపోతే ఎంత ధైర్యంగానన్నా వుండేది. మగాడొస్తన్నాడనే తలికి దడ పుట్టుకొచ్చేది. నోరు పెగలకపోయేది. అదేం రోగమో మరి!

అమ్మ గొంతంతా ఎటుబోయిందో మూగిదాన్లా నోరు తెరిసేది కాదు. నన్ను జూస్తే కళ్ళనీళ్లొచ్చేయి. పెళ్ళిజేసి నీ గొంతుకోశాననేది. అట్టా పదేళ్ళు గడిపింది.

ఆ పదేళ్ళలో నాకు ముగ్గురు మగపిల్లలు పుట్టిపోయారు. నా పిల్లలు బతకటం లేదనే దిగులు - అల్లుడి పెత్తనం.

చివరి చివర్లో అమ్మని పొలం రానిచ్చేవాడు కాదు.

యేటా నష్టాలే - అప్పులు పెరిగిపోతుంటే - అయ్యి తీర్చాలంటే పొలాలు కరిగిపోతుండే -

టవున్లో ఆయన సాగించే యవ్వారాలు అడక్కపోయినా ఎవరో ఒకరు చెవినేసిపోయేవాళ్ళు. చివరికి పొలం గురించిన దిగుల్తోనే ఆమె పోయింది. యాభైయేళ్ళకే బంగారమంటి మణిసి మట్టి పాలయింది.

అమ్మ పోయిన యేడాదిగ్గావాల నా కడుపున వీడు పడ్డాడు. పుట్టటమే రోగాల్తో పుట్టాడు. పిల్లాడికి రాని రోగం లేదు. ఎన్ని కష్టాలు పడ్డానూ - ఎన్ని కష్టాలు పడ్డాను. ఎట్టాగొట్టా వీడు బతికిబట్టకడతాడనే నమ్మకం కుదిరేసరికి ఎనిమిదేళ్ళపైగానే పట్టింది. ఈడికి నెమ్మదించేసరికి ఈడి బాబుకి క్షయరోగం పట్టుకుంది. దగ్గి దగ్గి రెండేళ్ళు నాచేత నానా చాకిరీ చేయించుకుని - పొలాలు అమ్మి అప్పులు మిగిల్చి చచ్చాడు. చచ్చింతర్వాత రెండెకరాల పొలం ఇల్లు ఈ పిల్లాడు - నాక్కాస్త వూపిరాడినట్టయింది.

ఎక్కడాలేని బలం వచ్చిపడింది. రెండెకరాలైతే మాత్రం ఏంది - పొలంలో పనిచేసుకుని - ఒక పాడిగేదెను పెట్టుకుని బతకలేకపోను. పిల్లాడ్ని బతికించుకోలేకపోను.

ఆ యింట్లోంచి ఒక మగాడు పోయాడంటే పీడా ఒదిలిందనే అనిపించింది. ఐతే ఏమయింది - యింకో మగాడు పుట్టి పెరుగుతానే వున్నాడాయె. మొగుడు పోయినా సంతోషంతో రాత్రింబగళ్ళూ కష్టపడి కొడుకుని పెంచాను. అప్పులు తీర్చాను. రెండెకరాలూ మిగిల్చాను. నాలుగు గొడ్ల పాడిచేశాను. వూళ్ళో హైస్కూలు చదువు అయ్యాక వాడీ అయిదరాబాదు వచ్చాడు. "ఏదో వుజ్జోగ"మన్నాడు. ఒద్దంటే యింటాడా? నాలుగేళ్ళు

బోయాక "యాపారం" అన్నాడు.

"నీ తిప్పలు నువ్వు పడు. నా తిప్పలు నేను పడతానన్నా".

"యాపారానికి పెట్టుబడి కావాల పొలం అమ్మకానికి పెట్టాల"న్నాడు. నా గుండె అట్టాగే జారిపోయింది. ఆ రెండకరాల్లోనే నా పేణాలూ నా తల్లి పేనాలూ వున్నయిగందా । అదమ్ముకుంటే మా అప్పమ్మ తల్లిని అమ్ముకున్నట్లేనని లబలబలాడితే మాత్తరం యిన్నాడా - ఏడ్చి మొత్తుకున్నా - వాడంతకన్నా మొండికెత్తాడు.

ఇంట్లో వుండి రెండు రోజులు అన్నం తినలా - నేనూ తినాలా

అడు నాయింట్లో పస్తుంటే నేనెట్టా తింటాను. నేనూ తినలా.

కానీ అడు మొగాడు. ఆడదాన్ని నేను తినకపోయినా పరవాలా -

మొగాడు తినకపోతే ఆ మాట దాగుద్దా - వూరంతా గుప్పుమంది.

ఆడే గెల్చాడు. ఎప్పుడయినా మొగాడే గెలుస్తాడు.

ఆడొక్కడేనా - ఊళ్ళో రామయ్యన్నా, ధర్మయ్య బావా. సుబ్బయ్య బాబాయి, లచ్చువయ్య తాతా అందరూ వచ్చారు.

"కొడుకు యాపారం చేసి సంపాదిస్తే యిట్టాంటి ఎకరాలు యెన్నయినా కొనొచ్చు. ఆడదానికి నీకింత పంతం పనికిరాద"న్నారు.

నిజమే - పంతాలున్నది మొగాళ్ళకోసమే గావాలు - ఆడదానికి నాకెందుకు.

మొగాళ్ళంతా మీసాలు మేలేసుకుంటూ నవ్వుతా నవ్వుతానే

నా రెండెకరాలూ అమ్మేసి, ఆ డబ్బు నాకళ్ళముందే నాకూ చేతులున్నాయని కూడా చూడకుండా నా కొడుకు చేతుల్లో పోశారు.

నా కొడుకు "అమ్మా అన్నం పెట్టు" అన్నాడు. నిమిషాల మీద వండి వాడికి పెట్టాను. నేను పెట్టుకోకముందే "ఎళ్ళొస్తా" "మళ్ళొచ్చి నిన్ను తీసికెళ్తా"నని ఎళ్ళిపోయాడు.

తరవాత ఆడిస్టం వచ్చిన పిల్లనే పెళ్లి చేసుకున్నాడు. బాగానే వున్నాడు. ఐదేళ్ళకు మళ్ళీ వచ్చాడు. అప్పటికి మనూరు కూడా మారింది.

పొలాల ధరలూ, యిళ్ళ స్తలాల ధరలూ పాపం పెరిగినట్లు పెరిగిపోయాయి. "యాపారం బెమ్మాండంగా వుంది. దాన్నింకా పెంచాల. ఇంటికి మంచి బేరం వచ్చింది. అమ్ముకుపోతా"నన్నాడు. "నువ్విక మాతోపాటే" అన్నాడు. అదుగో ఆనాడు మూతబడిన నా నోరు యియ్యాల్టిదాకా తెరుచుకోలా - నా పొలం పోయింది. నా యిల్లు పోయింది. నేను చచ్చిందాంతో సవానమయ్యా.

ఇయ్యాల యిదంతా నా స్వార్జితమని అంటన్నాడంటే పట్టలేక ఈ కదంతా

చెప్పుకొచ్చా. ఆడదాన్ని బూవికి దూరం చేసి మీరు మేడలు కట్టారు. నాకీ మేడలోసుకం లేదు. అది మీకు తెలవదు.

మేడల్లో, మిద్దెల్లో, కార్లలో, ఐసు మిషన్లలో సుఖముందనే నమ్మకాన్ని ఎవురు పుట్టిచ్చారో నాకు తెలవదు గాని యిక ఆ నమ్మకానికి తిరుగులేకుండా పోతాంది.

మీరంతా సుకంగా వున్నారని నాకు మాత్రం నమ్మకం కలగటంలా - నేను మాట్లాడను గానీ అన్నీ యింటానే వున్నా -

ఈ యాపారంలో రూపాయి రూపాయి గాలా - రూపాయి వంద రూపాయలయంది. అట్టాగావటం మీ తెలివయింది.

అదంతా నాకొద్దు - ఏదో వుండబట్టలేక అంటన్నా.

ఇన్నాళ్టికి నా మనవరాల్ని చూస్తుంటే మా అప్పమ్మమ్మని చూస్తన్నట్టే వుంది.

దానికి పొలం చెయ్యాలని వుంది. ఈ వయసులో నాక్కూడ మట్టి మీద బెమతగానే వుంది.

నా రెండెకరాల డబ్బు, ఇల్లమ్ముకున్న డబ్బు రూపాయి వొడ్డీ లెక్కగట్టి యియ్యి. నీ పాపిస్టి వొడ్డీలు నేనడగను.

ఇయ్యకపోతే నేనూ నా మనవరాలూ కోర్టెక్కుతాం.

ఇచ్చావా యిద్దరం అది కొనే పొలం దగ్గరికి పోతాం.

నేనా మట్టిలో కల్సిపోతా.

ఆడదానికి ఎవసాయం రాదన్నమాట ఎదవమాట. ఎవసాయం వచ్చిందే ఆడదానికి. ఆడదాని చేతుల్లోంచి ఎవసాయం లాగేసుకుని, బూవిలాగేసుకుని అంతా నాశనం చేస్తున్నారు.

నా మనవరాలికి డబ్బిచ్చేయి.

మా అప్పమ్మను అమ్మిననాడు దాని తల్లి నోరు తెరవలా నోట్లో మాటలు నోట్లోనే మింగి మింగలేక సచ్చింది.

నన్ను కన్న అమ్మాబాబూ నాకు పెళ్ళి చెయ్యమని ఒక మగాడ్ని నా మెడకు కట్టిననాడు అప్పమ్మ నోరెత్తలా.

నన్ను కట్టుకున్నోడు నన్ను గొడ్డుని బాదినట్లు బాది బూవిని నాశనం చేసి అమ్ముతావుంటే -

అంత ధైర్యస్తురాలైన మా అప్పమ్మమ్మా నోరు తెరవలా

మింగుకుని మింగుకుని సచ్చిపోయింది.

ఇన్నాళ్ళు నేనూ నోరెత్తకుండానే పడున్నాను.

ఇయ్యాల నా నమనవరాలు నోరెత్తింది. దానికి ధైర్యం వచ్చింది.

చదివిన చదువో - చూసిన ప్రపంచకవో యేదో గాని దాని నోరు తెరిపిచ్చింది.

మగాడి ముందు నోరెత్తే ధైర్యం రాకపోతే ఆడదేగాదు మొత్తం బూవే నాశనమవుద్దని నాకూ తెలిసొచ్చింది.

ఇంకా నేనూ నోరు మూసేదిలేదు.

వందేళ్ళనాడు మా అప్పమ్మను అమ్ముతావుంటే మూసుకుపోయిన మా అమ్మమ్మ నోరే యియ్యాళ తెర్చుకున్నట్టుంది.

మనింట్లో మగాడి మదానికీ, ఆడదాని మవునానికీ నూరేళ్ళు నిండినియ్యి.

పదమ్మా - పోదాం." మాధవి భుజాన చెయ్యేసింది వెంకాయమ్మ.

వెంకాయమ్మ ఒళ్ళో తలబెట్టుకుని మాధవి బావురుమంది.

"ఏడవొద్దె నా బంగారం - ఈ యేడుపే మన్నింతకాడికి తెచ్చింది.

యేడవొద్దు - లే - లే "

ఈ ముదివగ్గే తనకు కావల్సిన ఆసరా అని తెలిసినట్లయి మాధవికి ఎక్కడలేని బలం వచ్చింది.

నాయనమ్మకు కఱ్ఱ అందించింది.

కఱ్ఱ అందుకుంటూ మాధవి ముఖం చూసిన వెంకాయమ్మకు ఒక క్షణం తను అప్పమ్మ అయి మాధవి తనైనట్లూ

మరో క్షణం మాధవే అప్పమ్మ అయినట్లూ అనిపించి అంత ముదిమి గుండెల్లోంచీ బలం, ధైర్యం, సంతోషం పొంగుకొచ్చాయి.

*(5.5.1997, సుప్రభాతం)*